క్లుప్తంగా

తునికాకు కల్లాల తనిఖీ



గూడూరు : మండలంలోని మట్టెవాడ యూనిట్ పరిధిలోని ఊట్ల, మట్టెవాడ, కొంగర గిద్దలోని తునికాకు కల్లాలను శుక్రవారం డీఎఫ్ఓ బత్తుల విశాల్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వాతావరణ మార్పుల వల్ల ఆకుల కట్టలు తడవకుండా, ఎండిన కట్టలను ఎప్పటికప్పుడు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీఓ చంద్రశేఖర్‌రావు, ఎఫ్ఆర్వో సురేష్, బీట్, సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మరిపెడ రూరల్ : మరిపెడ మండలంలోని గిరిపురం, తానంచర్ల సబ్ స్టేషన్ పరిధిలోని ఆయా గ్రామాల్లో నేడు(శనివారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సబ్ డివిజనల్ ఏడీఈ లోక్‌నాథ్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ పెద్దనాగారం 132 సబ్ స్టేషన్ మరమ్మతులతో పాటు గిరిపురం, తానంచర్ల సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఆయా సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

'వాయిదా పద్ధతిలో చెక్కులు ఇవ్వొద్దు'

కేసముద్రం : వ్యవసాయ మార్కెట్‌లో వివిధ పంటలను విక్రయించినా రైతులకు వాయిదా పద్ధతిలో చెక్కులు ఇవ్వొద్దని, అలా చేసే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని మార్కెట్ స్పెషల్ గ్రేడ్ సెక్రటరీ అమరలింగేశ్వరరావు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే పలుమార్లు వ్యాపారులతో సమావేశం నిర్వహించి కొనుగోలు చేసిన రోజు తేదీనే చెక్కుపై రాసి ఇవ్వాలని చెప్పామని, అయినా వాయిదా పద్ధతిలో చెక్కులు ఇచ్చిన ట్రేడర్స్ లాగిన్‌లను ఈ–నామ్ నందు నిలుపుదల చేసినట్లు పేర్కొన్నారు. ఉద్దేశ పూర్వకంగా వ్యాపారులు ఎవరైనా వాయిదా పద్ధతిలో చెక్కులు ఇస్తే వారి లైసెన్స్‌లు రద్దు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పరామర్శ



పెద్దవంగర : కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటానని పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. మండలంలోని ఉప్పరగూడెం గ్రామానికి చెందిన నీలం బుచ్చమ్మ (58) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. బాధిత కుటుంబ సభ్యులను శుక్రవారం ఎమ్మెల్యే పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో కేతిరెడ్డి నిరంజన్ రెడ్డి, మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్, దుంపల కుమార స్వామి, వేముల వెంకన్న, రంగు మురళి గౌడ్, ఓరిగంటి సతీష్, యూత్ అధ్యక్షుడు బీసు హరికృష్ణ, ఆవుల మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీగా సబిత



పెద్దవంగర : ఎంపీపీగా ఎర్ర సబిత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల పరిషత్ అధ్యక్ష ఎన్నిక కోసం శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీటీసీలతో తొర్రూరు ఆర్డీఓ నర్సింహారావు ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎంపీటీసీల సమక్షంలో ఎంపీడీఓ వేణుమాధవ్ ఆమె చేత ప్రమాణ స్వీకారం చేయించారు.అయితే సబిత ఇటీవల కాంగ్రెస్‌లో చేరారు.

రేషన్‌డీలర్ల సంఘం ఎన్నిక

కురవి : రేషన్ డీలర్ల సంఘం మండల కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రుద్రారపు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా బాదావత్ రాజు, కోశాధికారిగా బాదె ప్రసాద్, ఉపాధ్యక్షులుగా గోనెల వెంకన్న, బాదావత్ రవి, సహాయ కార్యదర్శులుగా దేవకమ్మ, దీపక్‌గౌడ్, గౌరవ సలహాదారుడిగా మాలె గురులింగం, గౌరవ అధ్యక్షులుగా నాగబ్రహ్మాచారీ, సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులుగా బాబురావు, అరుణ, జలీల్, శ్రీనివాస్, ఉప్పలయ్యను ఎన్నుకున్నారు.

నర్సరీల్లో జాగ్రత్తలు తీసుకోవాలి

దంతాలపల్లి : వేసవి కాలంలో నర్సరీల్లో పెంచుతున్న మొక్కల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని తొర్రూరు డివిజనల్ పంచాయతీ అధికారి పుల్లారావు అన్నారు. మండలంలోని దాట్ల, బీరిశెట్టి గూడెం గ్రామాల్లో నర్సరీలు, డంపింగ్ యార్డ్, వైకుంఠధామాలు, పల్లెప్రకృతి వనాలను పరిశీలించారు. కార్యదర్శులు మల్లికార్జునస్వామి, భూలక్ష్మి, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

డీలర్లు నిబంధనలు పాటించాలి



గూడూరు: అవగాహన సదస్సులో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

- జిల్లా సహాయ వ్యవసాయ సంచాలకులు లక్ష్మీనారాయణ

గూడూరు : మండలంలో విత్తనాలు, ఎరువులు విక్రయించే డీలర్లు లైసెన్స్‌లు కలిగి, నిబంధనలు పాటించాలని జిల్లా సహాయ వ్యవసాయ సంచాలకులు లక్ష్మీనారాయణ అన్నారు. గూడూరు సమీప వడ్డెరగూడెంలోని రైతు వేదికలో శుక్రవారం మండలంలోని విత్తన, ఎరువులు, పురుగు మందులు విక్రయించే షాపుల నిర్వాహకులతో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీలర్లు ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా జారీ చేసిన వ్యాలీడ్ లైసెన్స్‌లు కలిగి ఉండాలని, షాపు పేరు, స్టాక్ బోర్డు, రిజిస్టర్‌లు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయించే డీలర్లు తప్పకుండా కొనుగోలు చేసే రైతుకు అందుకు సంబంధించిన బిల్, కంపెనీ పేరు రాసి రశీదు ఇవ్వాలన్నారు. అదే విధంగా వర్షాకాలం సమీపిస్తున్నందున రైతులు ప్రభుత్వం సూచించిన షాపులలో మాత్రమే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయ అధికారి అల్లె రాకేష్, ఏఈఓలు, డీలర్లు, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు నకిలీ విత్తనాల బారిన పడకండి

దంతాలపల్లి : రైతులు నకిలీ విత్తనాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి గాడిపెల్లి సందీప్ సూచించారు. మండలంలోని రామానుజపురంలో శుక్రవారం వానాకాలం పంటలలో తీసుకోవల్సిన జాగ్రత్తలను వ్యవసాయశాఖ దంతాలపల్లి ఆధ్వర్యంలో రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన పంటలైనా వరి, మొక్కజొన్న, మిరప పంటలు సాగుకు ముందు రైతులు ఆయా భూముల్లో జనుము వేయాలని, దీంతో అనేక ప్రయోజనాలను ఉంటాయని తెలిపారు. ప్రభుత్వం ఆమోదించిన విత్తనాలను మాత్రమే రైతులు విత్తుకోవాలన్నారు. రైతులు పంట మార్పిడి చేయడం వల్ల మేలు కలుగుతదని గుర్తుచేశారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి రమేష్, పలువురు రైతులు పాల్గొన్నారు.

విధిగా రశీదు తీసుకోవాలి: ఏఓ రామారావు

గార్ల : విత్తనాలు కొనుగోలు చేసే రైతులు విధిగా రశీదు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కావటి రామారావు సూచించారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులు విత్తన డీలర్ల వద్ద తీసుకున్న రశీదును పంట పూర్తయ్యేంత వరకు జాగ్రత్తగా దాచుకోవాలని సూచించారు. లైసెన్స్ కలిగిన విత్తన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని, గ్రామాల్లో తిరుగుతూ తక్కువ ధరలకు విత్తనాలు అమ్మే వారి వద్ద రైతులు కొనుగోలు చేయవద్దన్నారు. విత్తనాలు కొనేముందు రైతులు విత్తనాలు తయారైన తేదీ, గడువుతేదీని చూసి కొనుగోలు చేయాలని సూచించారు. విత్తన డీలర్లు నకిలీ విత్తనాలు అమ్మినట్లయితే రైతులు వెంటనే వ్యవసాయ కార్యాలయానికి సమాచారం అందించాలని సూచించారు. వ్యవసాయ కార్యాలయంలో రాయితీపై జీలుగు, వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు తమ పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్‌లను అందజేసి విత్తనాలు పొందగలరని ఏఓ కోరారు.



దంతాలపల్లి : రైతులకు సూచనలిస్తున్న సందీప్

నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలి

నర్సింహులపేట : రైతులు నాణ్యమైన విత్తనాలనే కొనుగోలు చేయాలని వ్యవసాయ శాఖ అధికారి మంజుఖాన్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలపై రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. షాపుల్లో లేబుల్ లేని విత్తనాలను, లూజ్ విత్తనాలను, ఎమ్మార్పీ రేటు చూసి తీసుకోవాలన్నారు. విత్తనాలు తీసుకున్న అనంతరం రశీదు తప్పని సరిగా తీసుకోవాలని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఈఓ రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

'నల్లమల' ఆశయాలు కొనసాగించాలి



డోర్నకల్ : మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

డోర్నకల్ /గార్ల : రైతాంగ సాయుధ పోరాట యోధుడు, సీపీఐ నేత నల్లమల గిరిప్రసాద్ ఆశయాలను కొనసాగించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి కోరారు. డోర్నకల్‌లో శుక్రవారం గిరిప్రసాద్ వర్ధంతిని ఆ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరులో పాల్వంచ ఏజెన్సీ దళనాయకుడిగా పాల్గొని ప్రజలతో కలిసి నిజాం పాలకులకు వ్యతిరేకంగా పోరాడారని తెలిపారు. సీపీఐ నాయకులు నెల్లూరి నాగేశ్వర్‌రావు, రమేష్, జెన్నె స్వామి, మాదవ్, కట్టెబోయిన శ్రీనివాసరావు, జంపాల వెంకన్న, పోతుల నర్సింహరావు, ధరావత్ వీరన్న, ఎల్.భీముడు, లోకేష్, సత్యం, ఉపేందర్‌రెడ్డి, రత్నం, క్రాంతి, అశోక్, మంగీలాల్, తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌తోనే యువతకు ఉద్యోగాలు'

కురవి : నిరుద్యోగులకు కాంగ్రెస్ పార్టీతోనే ఉద్యోగ అవకాశాలు వస్తాయని సీరోలు, కురవి, మరిపెడ మండలాల కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ కాలం రవీందర్‌రెడ్డి, సీరోలు మండల అధ్యక్షుడు కొండపల్లి కరుణాకర్‌రెడ్డి అన్నారు. వరంగల్–ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపునకు సీరోలు మండలం కొత్తూరు(సీ)లో శుక్రవారం పట్టభద్రుల ఓటర్లను కలిసి ఓట్లను అభ్యర్థించారు. మలిశెట్టి వేణు, బుడిగె లక్ష్మయ్య, కొప్పుల వెంకట్‌రెడ్డి, సూడి ఉపేందర్‌రెడ్డి, చిప్పరపల్లి వెంకన్న, యానాల వెంకటరెడ్డి, చిట్టూరి లక్ష్మీనారాయణ, వీరిశెట్టి శ్రీను, చిప్పరపల్లి మల్సూర్, సూడి సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నను గెలిపించండి

గార్ల : ప్రశ్నించే గొంతుక తీన్మార్ మల్లన్నను గెలిపించాలని ఏఎంసీ మాజీ చైర్మన్ భూక్యా నాగేశ్వరరావు కోరారు. శుక్రవారం గార్లలో ఆయన పట్టభద్రుల వద్దకు వెళ్లి ఓటర్లను కలిసి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని కోరారు.



కొత్తూరులో ఓట్లు అభ్యర్థిస్తున్న నాయకులు

గిరిజన విద్యావంతులు కాంగ్రెస్ వైపే..

డోర్నకల్ : గిరిజన విద్యావంతులు కాంగ్రెస్ పాలనపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని ఆపార్టీ మండల అధ్యక్షుడు డీఎస్ జగదీష్ తెలిపారు. మండలంలోని ముల్కలపల్లి, చిలుకోడు, గొల్లచర్లలో శుక్రవారం ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని కోరుతూ ఆయన ప్రచారం నిర్వహించారు.

ఉపాధి చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వీరయ్య

కురవి : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అల్వాల వీరయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని బూడిదకుంటలో జరుగుతున్న ఉపాధి పనులను సందర్శించి కూలీలతో మాట్లాడారు. వ్యవసాయ కార్మికుల హక్కులను బీజేపీ కాలరాస్తోందన్నారు. 100 రోజుల నుంచి 200 రోజుల వరకు పనిదినాలు పెంచాలని డిమాండ్ చేశారు. మే 20 నుంచి జూన్ 9 వరకు ఉపాధి రక్షణకై ఆందోళన కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. మహిళలకు రూ.2,500లు ఇవ్వాలని, కూలిబంధు పథకం కింద రూ.12వేలు ఇవ్వాలని,బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కట్ల కృష్ణయ్య, ఆకుల బాలయ్య, జక్కుల యశోద, కొత్త శ్రీనివాస్‌రెడ్డి, గాజుల రజని, కొణతం వీరన్న, ఉమ, కవిత, లింగన్న, రోశయ్య, వీరన్న, ఉపేంద్ర, రాజ్యలక్ష్మి, ఆనందం, కొమురయ్య, శ్రీలత పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

మహబూబాబాద్ అర్బన్ : క్రీడల్లో గెలుపు, ఓటమి సహజమని డీబ్ల్యూడీసీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు సమ్మర్ క్రికెట్ క్యాంప్ ఇన్‌చార్జ్ బి.అజయ్‌సారథిరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో శుక్రవారం క్రికెట్ క్యాంప్ క్రీడాకారులకు మ్యాచ్‌లు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా అజయ్‌సారథిరెడ్డి మాట్లాడుతూ వేసవిలో గ్రామీణ క్రీడాకారులకు మానుకోటలో సమ్మర్ ఉచిత క్రికెట్ క్యాంపులు నిర్వహించామన్నారు. రానున్న రోజుల్లో మానుకోట గడ్డ నుంచి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ సలహాదారులు బి.విజయ్‌సారథిరెడ్డి, 36వ వార్డు కౌన్సిలర్ నీరజారెడ్డి, కోచ్ కుమార్, వినయ్, సభ్యులు సంతోష్, నవీన్, వెంకటేశ్వర్లు, పెరుగు కుమార్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న అజయ్‌సారథిరెడ్డి

వైభవంగా ప్రభ బండ్ల ప్రదర్శన

గూడూరు : మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనారాయణస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి ప్రభ బండ్ల ప్రదర్శన వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా కళ్యాణం మరుసటి రోజు ప్రభ బండ్ల ప్రదర్శన ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగా రైతులు ఎద్దుల బండ్లను, ద్విచక్ర వాహనాలు, కార్లు, జీపులు, ట్రాక్టర్లను అలంకరించి దేవాలయం చుట్టూ మూడు ప్రదర్శనలు చేశారు. అక్కడ నుంచి వారంతపు సంత ప్రదేశంలో లక్ష్మీనారాయణస్వామి అశ్వవాహనంపై చేరుకుంటుంది. అనంతరం అశ్వవాహనం వీధుల గుండా వస్తుండగా, భక్తులు మంగళ హారతులతో స్వాగతం పలికారు.

నగదు బదిలీ చేయాలి



తొర్రూరు : డీడీలు చెల్లించిన గొర్రెల కాపరులకు వెంటనే నగదు బదిలీ చేయాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా కార్యదర్శి బొల్లం అశోక్ అన్నారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలో జీఎంపీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన గొర్రెల పంపిణీ పథకం రెండో విడత గొర్రెలకు కాపరులు డీడీలు చెల్లించారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విషయంలో నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు కొమ్మనబోయిన యాకయ్య, జమ్ముల శ్రీను, రామకృష్ణ, నాగరాజు, మురళి, ఐలయ్య, వెంకన్నలు పాల్గొన్నారు.

వేలాడుతున్న విద్యుత్ తీగలు



డోర్నకల్ : మున్సిపల్ పరిధిలోని రాజుతండా సెయింట్ పాల్స్ పాఠశాల పక్కన విద్యుత్ తీగలు కిందికి వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. వ్యవసాయ బావులకు వెళ్తున్న విద్యుత్ లైన్‌ను పాఠశాల పక్కనుంచే ఏర్పాటు చేశారు. దీంతో ఈదురు గాలుల వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. అధికారులు వెంటనే స్పందించి స్తంభాల మధ్య మిడిల్ పోల్స్ ఏర్పాటు చేయాలని రైతులు, అధికారులు కోరుతున్నారు.

విదేశీ విధానం భవిష్యత్‌కు నష్టం

దంతాలపల్లి : ప్రధాని నరేంద్రమోదీ అవలంబిస్తున్న విదేశాంగ విధానం భవిష్యత్‌లో దేశానికి తీరని నష్టాన్ని కలిగిస్తుందని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా కేంద్ర నాయకుడు కేచల రంగయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని పెద్ద ముప్పారంలో నిర్వహిస్తున్న జిల్లా రాజకీయ శిక్షణ తరగతులు రెండో రోజు ఆయన పాల్గొని మాట్లాడారు. రమ, పూనం ప్రభాకర్, ములుకూరి జగ్గన్న, పాయం చంద్రన్న, కొత్తపల్లి రవి, ముంజపల్లి వీరన్న, పాపారావు, యాకన్న ఉన్నారు.

బొడ్రాయి వార్షికోత్సవం

డోర్నకల్ : మండలంలోని తెల్లబండతండా పరిధిలోని ఎర్రకుంటతండాలో శుక్రవారం బొడ్రాయి ప్రతిష్ఠ ప్రథమ వార్షికోత్సవం నిర్వహించారు. బొడ్రాయికి జలాభిషేకం చేసి బోనాలు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

డోర్నకల్ /గార్ల : స్థానిక డీడీ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో శుక్రవారం నుంచి ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. గార్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.గోవిందరావు తెలిపారు. అయితే గార్ల పరీక్షా కేంద్రం వద్ద వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వ వైద్యాధికారి రాజ్‌కుమార్ జాదవ్ తెలిపారు.

కఠినంగా శిక్షించాలి

నెహ్రూసెంటర్ : గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని బొమ్మలరామారంలో పారిశుద్ధ్య కార్మికులను లైంగికంగా వేధింపులకు గురి చేసిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిషన్ ప్రణయ్‌ను కఠినంగా శిక్షించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొత్తపల్లి రవి, బిల్లకంటి సూర్యం శుక్రవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. వేధింపులకు గురి చేయడమే కాకుండా వీడియో చిత్రీకరించి ఇతరులకు పంపించడం హేయమైన చర్య అని పేర్కొన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

- జెడ్పీ సీఈఓ నర్మద



బీరిశెట్టిగూడెంలో పనులు పరిశీలిస్తున్న నర్మద

దంతాలపల్లి : అమ్మ ఆదర్శ పాఠశాలల్లో వసతుల కల్పనకు ప్రభుత్వం విధించిన నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తిచేయాలని జెడ్పీ సీఈఓ నర్మద అన్నారు. శుక్రవారం మండలంలోని, రామవరం, తూర్పుతండా, బీరిశెట్టిగూడెం, పంతులుతండా పాఠశాలల్లో జరుగుతున్న పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలలో నెలకొన్న మంచినీటి సమస్య, మూత్రశాలల నిర్మాణం, తరగతి గదులకు తలుపులు తదితర పనులకు ప్రభుత్వం నిధులు కేటాయించిందన్నారు. పాఠశాలల పునఃప్రారంభం వరకు పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంపీడీఓ వివేక్‌రామ్, ఎంపీఓ అప్సర్ పాష, ఆర్అండ్‌బీ డీఈ శ్యామ్‌సింగ్, ఏఈ ప్రదీప్ ఆయా గ్రామాల కార్యాదర్శులు పాల్గొన్నారు.

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర



శోభాయాత్రను ప్రారంభిస్తున్న నూనావత్ రమేష్

గూడూరు : మండల కేంద్రంలోని హనుమాన్ భక్త మండలి, శ్రీ లక్ష్మీనారాయణస్వామి సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం హనుమాన్ శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. మండలంలోని 39 జీపీలలో కలిపి మొత్తం 500 మంది వరకు హనుమాన్ మాలలు ధరించారు. గురుస్వామి మేరుగు మల్లయ్యగౌడ్ ఆధ్వర్యంలో హనుమత్ విగ్రహంతో స్థానిక శ్రీలక్ష్మీనారాయణస్వామి దేవాలయం నుంచి శోభాయాత్ర చేపట్టారు. ఆ యాత్రను లక్ష్మీనారాయణస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు నూనావత్ రమేష్‌నాయక్, మల్లయ్యగౌడ్ హనుమాన్ జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. కార్యక్రమంలో గురుస్వాములు భూక్య రవి, వెంకన్న, బాధావత్ చందు, మేరుగు మధు, దేవేందర్, వెంకన్న, రాజు,యాకయ్య, కోరె దేవేందర్, మాలాధరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఉపఎన్నికలో బీఆర్ఎస్‌దే గెలుపు

- మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్



సమావేశంలో మాట్లాడుతున్న సత్యవతి రాథోడ్

మహబూబాబాద్ : వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఉపఎన్నికలో బీఆర్ఎస్ గెలుపు తథ్యమని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజలను మోసం చేసిందన్నారు. సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ భూక్య జాన్సన్ నాయక్, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, జెడ్పీ చైర్‌పర్సన్ అంగోత్ బిందు, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేనీ వెంకన్న, నాయకులు పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, యాళ్ల మురళీదర్‌రెడ్డి, గద్దె రవి, రాజు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

గ్యాస్ లీకై ఇల్లు దగ్ధం

పెద్దవంగర : ఇంట్లో గ్యాస్ సిలిండర్ లీకేజీ కావడంతో మంటలు చెలరేగి ఓ ఇల్లు దగ్ధమైన సంఘటన మండల పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. చిన్నవంగరకు చెందిన యాసారపు యాదమ్మ ఇంట్లో వంట చేసుకుంటుంది. ప్రమాదవశాత్తు గ్యాస్ లీకై మంటలు చెలరేగి ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. రూ. 50 వేల నగదుతో పాటు ఫర్నిచర్, విలువైన పత్రాలు కాలిబూడిదయ్యాయని బాధితురాలు విలపించారు. ప్రభుత్వం ఆదుకొని ఆర్థిక సాయం అందించాలని స్థానికులు కోరుతున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మున్సిపల్ పరిధిలోని అనంతారం స్టేజీ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడని రూరల్ ఎస్సై వి.దీపికారెడ్డి శుక్రవారం తెలిపారు. సదరు వ్యక్తి శరీరంపై తెల్లటి బనియన్, కాఫీ కలర్ లోయర్ ధరించి ఉన్నాడని, గురువారం రాత్రి తమకు సమాచారం రాగా ఘటన స్థలానికి వెళ్లి గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించి భద్రపరిచామని పేర్కొన్నారు.

పోలీసుల అదుపులో పేకాటరాయుళ్లు?

బయ్యారం : మండలంలోని గంధంపల్లి–కొత్తపేటలోని ఓ ఇంట్లో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై శుక్రవారం రాత్రి బయ్యారం పోలీసులు దాడి చేసి పలువురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. పోలీసులకు అందిన పక్కా సమాచారం మేరకు దాడులు నిర్వహించగా పలువురు వ్యాపారస్తులు పేకాట ఆడుతూ పట్టుబడ్డట్లు ప్రచారం జరుగుతోంది. పట్టుబడిన వారిని బయ్యారం పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్టు సమాచారం. కాగా పోలీసులు వివరాలు శనివారం వెల్లడిస్తామని పేర్కొన్నారు.

గేదెను ఢీకొన్న బైక్.. ముగ్గురికి గాయాలు

చిన్నగూడూరు : నర్సింహులపేట మండలం ఫకీరాతండాకు చెందిన భూక్య నెహ్రూ, పద్మ, హరికృష్ణ బైక్‌పై గురువారం రాత్రి కురవి నుంచి తండాకు వస్తున్నారు. ఈక్రమంలో చిన్నగూడూరు సబ్ స్టేషన్ సమీపంలో గేదె రోడ్డుపై అడ్డుగా రావడంతో దాన్ని ఢీకొని కింద పడిపోయారు. వీరికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. గేదెకు బైక్ తగలి గాయపడడంతో కదలలేని స్థితిలో ఉంది.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య



ముని (ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురై మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని గాంధీపురం గ్రామానికి చెందిన పిడుగు ముని (30) గురువారం రాత్రి కురవి గేటు ఆర్‌ఓబీ సమీపంలో రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడని జీఆర్పీ ఎస్సై సురేష్ శుక్రవారం తెలిపారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని అవుతాపురం గ్రామానికి చెందిన పిడుగు ముని కొంతకాలంగా గాంధీపురంలో ఉంటున్నాడని స్థానికులు పేర్కొన్నారు. భార్యాభర్తల మధ్య కుటుంబ కలహాల కారణంగా అతడు మనస్తాపానికి గురై రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తమ్ముడు నాగరాజు ఫిర్యాదు మేరకు పోస్ట్ మార్టం అనంతరం మృతదేహాన్ని వారికి అప్పగించామన్నారు.

సంక్షిప్త సమాచారం

జోరుగా ఎమ్మెల్సీ ప్రచారం

బయ్యారం : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ప్రచారం మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం కొనసాగింది. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల తరఫున బరిలో ఉన్న అభ్యర్థులకు మద్దతుగా ఆయా పార్టీల నాయకులు పట్టభద్రుల ఇంటి వద్దకు వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించాలి



మహబూబాబాద్ అర్బన్ : వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఉపఎన్నికలో బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్ కోరారు. జిల్లా కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయంలో బీజేపీ నాయకులు శుక్రవారం ప్రచారం నిర్వహించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోసంగి మురళి, పట్టణ కార్యదర్శి సందీప్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సంపత్, మహిళా అధ్యక్షురాలు ఇందుభారతి, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా సత్యనారాయణను గెలిపించాలి



మహబూబాబాద్ అర్బన్ : వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఉప ఎన్నికలో స్వతంత్ర అభ్యర్థి విశ్రాంత ఎంఈఓ పూజారి సత్యనారాయణను గెలిపించాలని మానవ హక్కుల కమిటీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మొగుళ్ల భద్రయ్య కోరారు. జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశానికి భద్రయ్య హాజరై మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్సీ అభ్యర్థి సత్యనారాయణ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధ్యానత కల్పించి 38వ నంబర్‌కు ఓటు వేయాలని కోరారు.

స్వతంత్ర అభ్యర్థి రవిని గెలిపించాలి

కేసముద్రం : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న కర్నె రవిని గెలిపించాలని ఎంసీపీఐ(యు) జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎమ్మెల్సీ అభ్యర్థి రవిని గెలిపించాలని ఆ పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

దుక్కిటెద్దుకు ప్రాణం పోశారు

మరిపెడ రూరల్: వ్యవసాయ బావిలో పడిన దుక్కిటెద్దును బయటకు తీసి ప్రాణాలు కాపాడిన ఘటన మండలంలోని లక్ష్మాతండా గ్రామ పంచాయతీ పరిధిలోని జామ్లతండాలో జరిగింది. స్థానిక ఓ రైతు వ్యవసాయ బావిలో గుర్తు తెలియని దుక్కిటెద్దు ప్రమాదవశాత్తు జారిపడి, రోజంతా నరకయాతన అనుభవించింది. అయితే అటువైపు పనుల నిమిత్తం వెళ్లిన రైతు బావిలోని ఎద్దు ఆర్తనాదాలను గమనించి తండావాసులకు విషయాన్ని తెలియజేశాడు. అంతా కలిసి బావివద్దకు చేరుకొని ఎద్దును బావిలో నుంచి బయటకు తీసి ప్రాణాలు కాపాడారు. అయితే గుర్తు తెలియని ఎద్దు జామ్లతండా శివారు బావిలో పడిందని, దాన్ని బయటికి తీశామని, ఎవరితో గుర్తించి తోలుకొని పోవాల్సిందిగా శుక్రవారం సోషల్ మీడియాలో ఈ విషయాన్ని వైరల్ చేశారు.

రేపు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

మహబూబాబాద్ అర్బన్ : జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో రేపు (ఆదివారం) బాల, బాలికలకు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహిస్తున్నామని అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి బాస నాగమణి శుక్రవారం తెలిపారు. పూర్తి వివరాలకు 90526 70288 మొబైల్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.